నేటి నుంచి సహకార సంఘాల వారోత్సవాలు

పార్వతీపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వారం రోజుల పాటు సహకారం సంఘాల ప్రాధాన్యం, ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. జిల్లాలో అన్ని సహకార సంఘాల డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచామని తెలిపారు. పీఎం జన ఔషధి ద్వారా జిల్లాలో జనరిక్ మందుల షాపులను ప్రారంభించినట్లు చెప్పారు. మూడు పెట్రోల్ బంకులతో పాటు గిడ్డంగుల నిర్వహణ సహకార సంఘాలకు అప్పగించామన్నారు.

గిరిశిఖరంపై వైద్యం



కరడవలసలో ప్రారంభానికి సిద్ధమైన కంటైనర్ (గిరి ఆరోగ్య కేంద్రం) ఆసుపత్రి



- కారడవలసలో నాలుగు బెడ్లతో కంటైనర్ ఆసుపత్రి ఏర్పాటు
- అందనున్న 15 రకాల వైద్య సేవలు ● త్వరలో ప్రారంభం ● గిరిజనులకు తప్పనున్న కష్టాలు

సాలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కొండ శిఖర గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గిరి వైద్య కేంద్రాల పేరిట కంటైనర్ ఆస్పత్రుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా సాలూరు మండలం తోణాం పీహెచ్‌సీ పరిధి గిరిశిఖర పంచాయతీ కరడవలసలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధమైంది. దీని ద్వారా సాలూరు మండలంలోని కరడవలస, కరడకొత్తవలస, నారింజపాడు, బొడ్డపాడు, బెల్లపాక, పాచిపెంట మండలంలోని ఆజూరు, కుంబివలస, కంకణాపల్లి, చాకిరేవువలస తదితర గ్రామాల్లోని 2వేల మందికి వైద్య సేవలు అందనున్నాయి. ఇక్కడకు వారానికి రెండు రోజులు తోణాం పీహెచ్‌సీ వైద్యుడు వస్తారు. మిగిలిన రోజుల్లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్), హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా, సీహెచ్‌డబ్ల్యూ సేవలందిస్తారు. అంగన్‌వాడీ కార్యకర్త సైతం సహకరించాల్సి ఉంటుంది. ఈ కంటైనర్ ఆసుపత్రిలో వైద్యుడి గది, రోగులకు చికిత్స అందించడానికి నాలుగు బెడ్లతో కూడిన గది, టీవీ, బాల్కనీ ఉన్నాయి. 15 రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు. టీకా కార్యక్రమం నిర్వహించనున్నారు. మందులు అందుబాటులో ఉంటాయి. గర్భిణులకు తనిఖీలు చేయనున్నారు. వారికి రక్తహీనత ఉంటే ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇక్కడే చేయనున్నారు. ఈ కంటైనర్ ఆసుపత్రిని ఇటీవల జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం పనితీరును బట్టి జిల్లాలో మరో నాలుగు గిరిశిఖర గ్రామాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.



రోగుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

కలెక్టర్ ఆలోచనతోనే..

గిరిశిఖర గ్రామాలకు సరైన రోడ్లు లేక ఆయా గ్రామాల ప్రజలు వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురైన వారిని, ప్రసవాల కోసం గర్భిణులను డోలి మోతలతో కొండల నుంచి కిందకు దించుతున్నారు. డోలితో దిగడానికి ఇష్టం లేనివారు నాటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిశిఖరాల్లో డోలి మోతలకు స్వస్తి పలకాలని సీఎం చంద్రబాబునాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వినూత్న ఆలోచనతో కంటైనర్ ఆసుపత్రి పురుడుపోసుకుంది. దీనికోసం రవాణా సౌకర్యాలకు దూరంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేశారు. కంటైనర్ ఆసుపత్రికి గిరి ఆరోగ్య కేంద్రం అని నామకరణం చేశారు. సమీపంలో వైద్యసేవలు అందుబాటులో ఉంటే (మిగతా 8వ పేజీలో...)

అసెంబ్లీ దృష్టికి
మన్యం సమస్యలు

- ప్రస్తావించిన విప్
- అభివృద్ధి పనుల ప్రగతిని తెలియజేసిన మంత్రి



పార్వతీపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు గళమెత్తారు. స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి ప్రగతిని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రెండు వేల గిరిజన గ్రామాల్లో రూ.2,500 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఫీడర్ అంబులెన్స్‌లను కూడా మంజూరు చేశామన్నారు. అటవీ, గిరిజన ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేయండి



కొమరాడ/ గుమ్మలక్ష్మీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కురుపాం ఎమ్మెల్యే, విప్ తోయక జగదీశ్వరి కోరారు. ఈ వంతెన పూర్తయితే కొమరాడ , కురుపాం ప్రజలకు రవాణా కష్టాలు తప్పుతాయన్నారు. డోలీ మోతలు కూడా ఉండవని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని, కొండశిఖర గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

రహదారిపై ఏనుగులు

కొమరాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామ రహదారిపై బుధవారం ఏనుగుల సంచరించాయి. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఏడు ఏనుగుల గుంపును ఒక్కసారిగా చూసి హడలెత్తిపోయారు. అవి ఎవరిపై దాడి చేస్తాయోనని తీవ్ర ఆందోళన చెందారు. గజరాజుల హల్‌చల్ కారణంగా ఆ రహ దారిలో సుమారు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని సమీప పంట పొలాల్లోకి ఏనుగులను తరలించారు. దీంతో ఆ ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా కొద్ది రోజుల నుంచి ఏనుగులు కుమ్మరిగుంట, కంబవలస, కందివలస, తదితర గ్రామాల్లో సంచరిస్తుండటంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రాజ్యలక్ష్మీపురం గ్రామ రహదారిపై సంచరిస్తున్న ఏనుగులు

విద్యార్థుల సంరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే..

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాస్తవ

పార్వతీపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థుల సంరక్షణ బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులదేనని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీ వాస్తవ తెలిపారు. బుధవారం గిరిమిత్ర సమావేశ మందిరంలో మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు 20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని వారి విద్య, ఆరోగ్యం, నడవడికపై దృష్టి సారించాలన్నారు. పీడీ, పీఈటీలు పిల్లలతో విధిగా కార్యక్రమాలు నిర్వహించాలని , మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. నెలలో కనీసం రెండు రోజులు రాత్రి బస చేయాలన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ: జేసీ

పార్వతీపురంటౌన్/బెలగాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉందాం..ప్రమదాలు నివారిద్దాం' అని జేసీ శోభిక పిలుపునిచ్చారు. బుధవారం యువజన సర్వీసులు, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కుటుంబ సభ్యులను గుర్తించుకుని వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదానికి గురైతే.. కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ నియమాలు పాటించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

నాట్య మయూరి.. ఈ చిన్నారి



- చదువుతో పాటు కూచిపూడిలో రాణిస్తున్న పాలకొండ బాలిక ఐతిహ్య
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు
- నేడు జాతీయ బాలల దినోత్సవం

6 లో

ఆహారం.. అలవాట్లే కీలకం



- మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చంటున్న వైద్యులు
- నేడు అంతర్జాతీయ మధుమేహ వ్యాధి నివారణ దినం

6 లో

పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు గుర్తించండి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

పార్వతీపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో న్యూమోనియా లక్షణాలను గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి సూచించారు. బుధవారం జిల్లా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో శాన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సర్వే చేసి న్యూమోనియా లక్షణాలున్న పిల్లలను గుర్తించి తగు చికిత్స అందించాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణరావు మాట్లాడుతూ... పీసీవీ వ్యాక్సిన్ మూడు డోసులు షెడ్యూల్ ప్రకారం పిల్లలకు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రో గ్రాం అధికారులు టీజగన్మోహన్ రావు, వినోద్, శ్రీధర్, డీపీహెచ్‌ఎన్‌వో ఉషారాణి, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



న్యూమోనియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఏజెన్సీలో కాఫీ సాగు.. ప్రోత్సాహమే కరువు

- గత ఐదేళ్లూ అందని ఆర్థిక సాయం
- దృష్టి సారించని వైసీపీ సర్కారు
- ఇబ్బందుల్లో గిరిజన రైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



6 లో

పల్లె పండగ పనులన్నీ ప్రారంభించాల్సిందే..

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమం కింద జిల్లాలో గుర్తించిన పనులన్నీ ప్రారంభించాల్సిందేనని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. డిసెంబరు నెలాఖరుకు అన్ని పూర్తి కావాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన 521 పనుల్లో 386 పనులు ఇంతవరకు ప్రారంభం కాకపో వడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు ఏఈఈలకు చార్జి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లా డుతూ.. రహదారులు, వంతెనలు, కల్వర్టులపై ప్రత్యేకంగా దృష్టిసారిం చాలన్నారు. రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడంపై మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో వర్క్‌లు చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులదేనన్నారు. 19 గిరిజన గ్రామాల్లో తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఐటీడీఏల ఈఈలు, డీఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

● బెలగాం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర పార్వతీపురం కల సాకారం అవ్వాలంటే పట్టణంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యం మెరుగు పరిస్తే స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధ్యమన్నారు. దోమల నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల వినియోగం పెరగాలని సూచించారు. వ్యక్తిగత పరి శుభ్రతతో వ్యాధులను నిర్మూలించొచ్చని తెలిపారు. వ్యర్థ పదార్థాలతో సంపద సృష్టించొచ్చన్నారు.

గంజాయి నియంత్రణకు చర్యలు

- ఎస్పీ మాధవరెడ్డి



పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

సాలూరు/ పాచిపెంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. బుధవారం పాచిపెంట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గంజాయి సాగు స్థానికంగా లేదు. అయినప్పటికీ డ్రోన్ల సహాయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభించాం. పోలీసుల తనిఖీల్లో కొందరు గంజాయి పట్టుబడుతున్నా.. మరికొందరు అడ్డ దారుల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కాకుండా బస్సుల్లో కూడా మహిళలను ఉపయోగిస్తూ గంజాయి రవాణా చేస్తున్నారు. పలు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక డాగ్‌ల ద్వారా గంజాయి అక్రమ రవాణాను గుర్తిస్తున్నాం. గంజాయి పూర్తిస్థాయి నియంత్రణకు ఒడిశా టాస్క్‌ఫోర్స్ అధికారులతో చర్చలు జరిపాం. తమిళనాడు, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి గంజాయి తరలించే అవకాశాలు ఉన్నాయి. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూసేందుకు ఆశ్రమ పాఠశాలలు, పాఠశాలల వద్ద అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతాల్లో మావోయిస్టులు లేకపోయినప్పటికీ నిఘా కొనసాగుతూ ఉంటుంది. సిబ్బందిని కూడా ఈ విషయంలో అప్రమత్తం చేశాం.' అని ఆయన తెలిపారు. ఏఎస్పీ అంకిత సురానా, సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటకృష్ణ ఉన్నారు.

● సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్న వారికి సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. త్వరలో పోలీస్ సిబ్బంది నియామకం జరుగుతుందని, సీసీ కెమెరాలతో జిల్లాలో నిఘా పెంచుతామని తెలిపారు. ఇప్పటివరకు 320 కేజీల గంజాయిని సీజ్ చేశామన్నారు. పట్టణ సీఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భళా.. బాలయా



'పూవు పుట్టగానే పరిమళిస్తుంది' అనే పెద్దల మాట కొందరు పిల్లల విషయంలో అక్షరాలా నిజమవుతోంది. చిన్ననాటి నుంచే తమకు ఇష్టమైన రంగంలో రాణిస్తూ.. అవార్డులూ... రివార్డులూ అందుకుంటున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో దూసుకెళుతున్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న చిన్నారుల విశేషాలు...

నాట్య మయూరి.. ఈ చిన్నారి

- చదువుతో పాటు కూచిపూడిలో రాణిస్తున్న పాలకొండ బాలిక
- ఉత్తమ ప్రదర్శనలతో శభాష్ అనిపించుకుంటున్న ఐతిహ్య
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



అమ్మవారి ఉగ్రరూపంలో ప్రదర్శన ఇస్తున్న ఐతిహ్య

పాలకొండ/సీతంపేట రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిరు ప్రాయంలోనే కూచిపూడి నాట్యంలో అనేక ప్రదర్శనలు ఇస్తూ.. అందరి మన్ననలు పొందుతోంది పాలకొండకు చెందిన కొండదాడి ఐతిహ్య. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఓ వైపు చదువు.. మరోవైపు నాట్యంలోనూ రాణిస్తోంది. సంగీతం, కీ బోర్డు ప్లేయర్‌గా కూడా తనకంటూ ఓ ప్రత్యేకత సంపాదించుకుంది. షిర్డీ, కాకినాడ, సింహాచలం, శ్రీశైలం, రాజమండ్రి, భీమవరం, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, ఐనవిల్లి, విజయవాడ, వేలూరు స్వర్ణ దేవాలయం, అంతర్వేది, ద్వారపూడి వంటి ప్రముఖ దేవాలయాల్లో ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. ఇటీవల దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాలకొండలోని కోటదుర్గమ్మ సన్నిధిలోనూ తన కూచిపూడి నృత్య ప్రదర్శనతో అందరి ఆశీస్సులు పొందింది. భరత్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కూచిపూడి కళా వైభవం, మహా బృంద నాట్యం కార్యక్రమంలో ఐతిహ్య ప్రదర్శనలిచ్చి.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఐతిహ్య తండ్రి రాజేష్ విజయవాడలో ఓ ఫార్మా కంపెనీని నడుపుతుండగా, తల్లి అనురాధ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం బాలిక విజయవాడలోని స్టేట్ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతుంది. కాగా తన మూడో ఏట నుంచి నృత్యాన్ని నేర్చుకుంటున్న ఐతిహ్య ఇప్పటివరకు 100కి పైగా ప్రదర్శనలు ఇచ్చింది. నర్తనబాల, నాట్యమయూరి, నర్తన కౌశల్య, కళాకార్ అవార్డులు పొందింది. తెలంగాణా రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు వంటి పెద్దలందరో అభినందించి.. బహుమతులు అందించారు. తనకు నటి సాయిపల్లవి డ్యాన్స్ అంటే చాలా ఇష్టమని, క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుంటానని ఐతిహ్య తెలిపింది. నాట్య రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

చదరంగంలో చిచ్చర పిడుగు..



డీఆర్ఎం కప్ పోటీలో ఆడుతున్న లక్ష్మీచరణ్‌నాయుడు (ఫైల్)



బొబ్బిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని సాహితీ నగర్‌కు చెందిన గొర్లె లక్ష్మీచరణ్‌నాయుడు చదరంగం క్రీడలో రాణిస్తున్నాడు.అతని ఇంటర్నేషనల్ రేటింగ్ 2006గా నమోదైంది. జాతీయ స్థాయిలో 15, రాష్ట్ర స్థాయిలో 20సార్లు పాల్గొని సత్తా చాటాడు. 2009లో జన్మించిన చరణ్‌నాయుడు ఆరేళ్ల ప్రాయంలో చదరంగంలో ఓనమాలు దిద్దడం ప్రారంభించాడు. 2015లో బొబ్బిలిలో జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి అండర్-7 పోటీల్లో మొదటిసారి పాల్గొని విజేతగా నిలిచాడు. అదే ఏడాది పార్వతీపురంలో జరిగిన పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించాడు.

- ఎల్‌బీహెచ్ఎం ఇంటర్నేషనల్, జైపూర్ ఓపెన్ టోర్నమెంట్‌లలో పాల్గొని 2006 ఫైడ్ రేటింగ్ సాధించాడు. జీఎం టైటిల్ (గ్రాండ్ మాస్టర్) అందుకోవాలన్న లక్ష్యంతో అకుంఠిత దీక్షతో సాధన చేస్తున్నాడు. ఇందులో భాగంగా త్వరలో అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనబోతున్నాడు. రష్యా తదితర దేశాలకు చెందిన నిపుణుల వద్ద ఆన్‌లైన్‌లో మెలకువలు తెలుసుకుంటున్నాడు.
- 2016లో విశాఖలో జరిగిన పోటీలో నేషనల్ చాంపియన్‌షిప్, 2017లో అండర్-9 లో డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్, 2018లో అండర్-11లో డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ సాధించాడు.
- ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న లక్ష్మీచరణ్ నాయుడు చదువుకు ఇబ్బంది లేకుండానే సాధనను కొనసాగిస్తున్నాడు. స్పెల్‌బీ విజేతగా చిన్నప్పుడే చరణ్ రాణించాడు.
- విశాఖలో జరిగిన డీఆర్ఎం కప్ పోటీలో చరణ్ పావులు కదిపిన తీరు ప్రశంసలు అందుకుంది.
- లక్ష్మీచరణ్ తండ్రి జగదీశ్వరరావు గాదెలవలస జెడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయుడు. తల్లి విజయలక్ష్మి బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు.



ఆకుపై నెహ్రూ చిత్రం

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా దెందేరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన డ్రాయింగ్ టీచర్ జీఎంజీ పరమేశ్వరరావు ఆకుపై మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రాన్ని వేసి ఆకట్టుకున్నారు. నెహ్రూకు చిన్న పిల్లలంటే ఎంతో ఇష్టం. అందుకే నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తారు. అందుకే ఈ చిత్రం గీసినట్టు ఆయన పరమేశ్వరరావు తెలిపారు.

-కొత్తవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

20లో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలి: జేసీ సేతుమాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధ్యానం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలను ఈనెల 20లోగా సమర్పించాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన చాంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్ మిల్లర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు గోనె సంచులను ఏర్పాటు చేయాలని సూచించారు. 33 శాతం గోనె సంచులు ఏర్పాటు చేయకపోతే ట్రక్ షీటు జనరేట్ కాదన్నారు. తేమ శాతం యంత్రాలను కొనుగోలు చేయాలని, అవసరమైన హమాలీల ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం మీనాకుమారి, డీఎస్‌వో మధుసూధనరావులు ఉన్నారు.

100 రోజులు ప్రణాళికపై సమీక్షించిన జేసీ

వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన అధికారులతో 100 రోజులు ప్రణాళికల, పురోగతి కార్యాచరణపై తన చాంబర్‌లో ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి శాఖ వారి లక్ష్యాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో కలెక్టర్ ఆమోదం తప్పనిసరన్నారు.

మన్యంలో కాఫీ సాగు ప్రోత్సాహమే కరువు



పాచిపెంట మండలం గిరిశిఖర గ్రామం సతాభిలో సాగువుతున్న కాఫీ తోటలు

- గత ఐదేళ్లు అందని ఆర్థిక సాయం
- దృష్టి సారించని వైసీపీ సర్కారు
- ఇబ్బందుల్లో గిరిజన రైతులు
- మార్కెట్ వసతి, గిట్టుబాటు ధరకు నోచుకోని వైనం
- అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగుకు శ్రీకారం
- ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పండిన కాఫీ గింజలు

పాచిపెంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కాఫీ సాగుకు అనువైన ప్రాంతం. ఇక్కడ పండించే పంటకు ఎంతో గిరాకీ ఉంది. అరకు తర్వాత మన్యం జిల్లా కాఫీకి ఆ స్థాయి పేరున్నా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రోత్సాహం కరువైంది. దీంతో గిరిజన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వాస్తవంగా పాచిపెంట మండలంలో గిరి శిఖర గ్రామాలు కాఫీ తోటల పెంపకానికి ఎంతో అనుకూలం. ఎత్తయిన కొండలు.. చల్లని ప్రదేశం సాగుకు కలిసిరావడంతో ఎంతో మంది రైతులు తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం సతాభి, తంగ్లాం గ్రామాల్లో వారు కాఫీ తోటల సాగు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక్క పాచిపెంట మండలంలోనే గిరిజనులు ఈ సాగు చేపడుతున్నా గత వైసీపీ ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. తోటల పెంపకానికి ఎంటువంటి ఆర్థిక సహాయం అందించ లేదు. కనీసం మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించ లేదు. దీంతో గిరిజన రైతులు ఏటా ప్రైవేట్ వర్తకులు, దళారుల దోపిడీకి గురై భారీగా నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. సాలూరు మండలంలో వివాదాస్పద కొఠియా గ్రూపు ఒడిశా గ్రామాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం కాఫీ తోటలు పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. కానీ గత ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి ఉండేది కాదని గిరిజన రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి.. తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

విశాఖ జిల్లా అరకు, అనంతగిరి ప్రాంతాల సమీపంలో ఉన్న సతాభి, తంగ్లాం గిరి శిఖర గ్రామాలు పాచిపెంట మండలంలో ఉన్నాయి. అప్పట్లో అక్కడ గిరిజన రైతులు కొంతమంది గంజాయి సాగు చేసేవారు. అయితే 1997 లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ గ్రామాలపై దృష్టి సారించింది. వారికి మెరుగైన జీవనోపాధి కల్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఐటీడీఏ పీవో పి.దమయంతి ఆయా గిరిజన గ్రామాల్లో పర్యటించారు. గంజాయి సాగు మానేయాలని రైతులకు సూచించారు. అనంతరం వారి జీవన శైలి, గంజాయి సాగుపై నివేదిక అందించారు. దీనిపై స్పందించిన గత టీడీపీ ప్రభుత్వం.. గిరిజన రైతులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో వారికి ఆర్థిక సాయం అందించింది. దీంతో ఆ ప్రాంతవాసులు గంజాయి సాగుకు దూరమై కాఫీ తోటల పెంపకం చేపట్టారు. అప్పట్లో ఆ కాఫీ గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేసేది. ప్రస్తుతం సతాభి, తంగ్లాం గ్రామాల్లో 50 మంది రైతులు సుమారు పది ఎకరాల్లో కాఫీ తోటలు పెంచుతున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. ఆర్థిక సహాయం అందక గిరిజన రైతులు డీలా పడిపోయారు. వారిని పట్టించుకునే వారే కరువయ్యారన్నారు.

మార్కెట్ సదుపాయం లేక..

ప్రస్తుతం ఎకరాకు పది బస్తాలు వరకు దిగుబడి వస్తోంది. కేజీ కాఫీ గింజల ధర రూ. 250 నుంచి రూ. 300ల వరకు ఉంది. అయితే మార్కెట్ సదుపాయం లేకపోవడంతో గిరిజన రైతులు అరకు, గుమ్మికోట వెళ్లి ప్రైవేట్ వర్తకులకు పంటను విక్రయించాల్సి వస్తోంది. గత ఐదేళ్లు తోటల పెంపకం నుంచి పంటను విక్రయించుకునే వరకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గిరిజన రైతులు సారా రాజు, లచ్చయ్య తదితరులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి జీసీసీ ద్వారా గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై సాలూరు ఉద్యాన శాఖాధికారి బి.ఝాన్సీ రాణిని వివరణ కోరగా.. 'ప్రస్తుతం గిరిజన రైతులు కూటమి ప్రభుత్వం పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాఫీ తోటల పెంపకం, మార్కెట్ సదుపాయం, రైతుల పరిస్థితి.. తదితర విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం' అని తెలిపారు.

ఆహారం.. అలవాట్లే కీలకం







- మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చంటున్న వైద్యులు
- సుగర్ ఉన్నా అదుపులో ఉంచుకోవడానికి అనేక మార్గాలు
- జిల్లాలో పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినం



విజయనగరం రింగురోడ్డు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి): మధుమేహ (డయాబెటిక్) వ్యాధిగ్రస్తులు దాదాపు ఇంటికొకరుగా పెరుగుతున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక బరువు, ఊబకాయం కారణంగా చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ మధుమేహం బారిన పడుతున్నారు. సరైన చికిత్స తీసుకోక, జాగ్రత్తలు పట్టించుకోక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అయితే రోజూ తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకుని.. అలవాట్లు మార్చుకుంటే సుగర్ రాదని వైద్యులు సూచిస్తున్నారు. వచ్చినా ఇబ్బంది లేకుండా అదుపులో ఉంచుకోవచ్చునంటున్నారు. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారిలో 60 శాతం మందిలో మధుమేహ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 2023 సంవత్సరంలో 73,759 మంది చికిత్స పొందగా, 2024లో అక్టోబరు వరకూ 39, 131 మంది చికిత్స పొందారు. ఇతర వ్యాధులకు చక్కెర వ్యాధితో సంబంధం ఉండడంతో శస్త్ర చికిత్సలకు ప్రత్యేక వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.. డయాబెటీస్‌ను అశ్రద్ధ చేస్తే ఇన్‌ఫెక్షన్‌కు గురై అవయవాల తొలగింపు వరకూ దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. అంతవరకూ వస్తే జీవచ్ఛవం లా బతకాల్సి వస్తుంది. దీనివల్ల ఇటు రోగికి, అటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఇబ్బందులే. నిర్లక్ష్యం చేయకుండా వైద్యం పొంది తే అన్నివిధాలా మేలంటున్నారు.

ఆ రోజు ఎందుకంటే..

1922లో సర్ ఫ్రెడరిక్ బాంటింగ్ తన సహచర శాస్త్రవేత్తలతో కలిసి ఇన్సులిన్‌ను కనిపెట్టారు. తద్వారా మధుమేహ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదని రోగుల్లో ధైర్యాన్ని నింపాడు. ఆయన చేసిన విశేష కృషికి గాను, ఏటా సర్ ఫ్రెడరిక్ పుట్టినరోజు నవంబరు 14న వరల్డ్ డయాబెటిక్ డేగా జరుపుకుంటున్నారు.

రకాలు ఇవే..

మధుమేహం టైప్-1, టైప్-2 డయాబెటీస్‌గా ఉన్నాయి. టైప్-1 డయాబెటీస్ అనేది ఒక రకమైన జన్యుపరమైన రుగ్మత, ఇది ఒక తరం నుంచి మరొక తరానికి వ్యాప్తి చెందుతుంది.. టైప్-2 డయాబెటీస్ జీవనశైలి, అలవాట్లతో వస్తుంది.

టైప్-2 కారణాలు ఇవే..

రోజు మనం తినే ఆహారం నుంచి శరీరం గ్లూకోజ్‌ని గ్రహించి శక్తిగా మారుస్తుంది.. ఇందుకు క్లోమ గ్రంధి ఉత్పత్తి చేసే ఇన్సులిన్ సహాయం చేస్తుంది.. ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి కాకపోయినా, ఉత్పత్తి అయిన దానిని శరీరం ఉపయోగించుకోలేకపోయినా, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి అది మధుమేహానికి దారితీస్తుంది.. శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, సమయానికి నిద్ర పోకపోవడం, మద్యపానం, ధూమపానం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం తదితర కారణాలతో మధుమేహం బారిన పడే అవకాశం ఉంది.

లక్షణాలు ఇవే..

తరచూ మూత్ర విసర్జన, విపరీతమైన ఆకలి, ఎప్పుడు నీరసంగా వుండడం, అధిక దాహం, శరీరంపై గాయాలు మానకపోవడం, చిగుళ్ల వ్యాధులు, చర్మవ్యాధులు, కంటిచూపు మందగించడం, పాదాల తిమ్మిర్లు ఉంటాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..



మధుమేహాన్ని నియంత్రించకుంటే అది కంటి రెటీనాపై ప్రభావం చూపి శాశ్వత అంధత్వం సంభవించే ప్రమాదం ఉంది. రోగులు ఏటా కంటి పరీక్షలు చేయించుకోవాలి. ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా వుండే ఆహారపదార్థా లు, ప్రొటీన్స్ ఎక్కువగా వుండే బీన్స్ పప్పుధాన్యాలు, కొవ్వు తక్కువగా వుండే పదార్థాలు, కార్బోహైడ్రేట్స్ తక్కువగా వుండే జామకాయ, పుచ్చకాయ, బొప్పాయి, నారింజను తీసుకోవాలి. ఆకుకూరలు, చిరుధాన్యాలు, బాదం, వాల్‌నట్స్‌ను ఆహారంగా తీసుకోవాలి. అప్పుడే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ప్రధానంగా చక్కెరతో చేసిన పదార్థాలు, అరటి, సపోటా, శీతాఫలం, ద్రాక్ష, పనసపండ్లును మధుమేహ రోగులు తినకూడదు. 25 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి షుగర్ పరీక్ష చేసుకోవడం ఉత్తమం.

-డాక్టరు బి.సుదర్శి, హెచ్ఓడీ, జనరల్ మెడిసన్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా: ఎస్పీ



నేర సమీక్షకు హాజరైన పోలీసు అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో మళ్లీ నేరాలకు పాల్పడతారన్న అనుమానం ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించకుండా కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. డాబాల్లో మద్యం సరఫరా చేయకుండా చూడాలన్నారు. మద్యం సరఫరా చేస్తే, వారిపె కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పేకాట, కోడిపందేలు నిర్వహించకుండా ముందస్తు సమాచారం సేకరించి విస్తృతంగా దాడులు నిర్వహించాలని ఆదేశించారు. గురువారం నిర్వహించనున్న లోక్‌ఆదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికతో పని చేయాలన్నారు. మిస్సింగ్ కేసులో అలసత్వం వద్దని... కేసు నమోదైనే వెంటనే దర్యాప్తు ముమ్మరం చేయాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ కనుగొనాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టుబడిన వారిపై సస్పెక్టడ్ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. రాత్రి పూట గస్తీ, పెట్రోలింగు పటిష్టవంతంగా చేయాలన్నారు. రాత్రి 11 గంటల తరువాత అకారణంగా తిరిగే వారిని స్టేషన్‌కు తరలించి... కౌన్సిలింగ్ నిర్వహించి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సౌమ్యలత, జి .నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, రాఘవులు, వీరకుమార్, యూనివర్స్, న్యాయ సలహాదారు పరశురామ్ పాల్గొన్నారు.

ఎస్.కోట నియోజకవర్గానికి రెండు పదవులు



మళ్ల రామకృష్ణ



మాకిరెడ్డి శ్రీలక్ష్మి



శ్రీనివాసరావు

శృంగవరపుకోట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం బుధవారం సాయంత్రం ప్రకటించిన కార్పొరేషన్ సభ్యుల జాబితాలో శృంగవరపుకోట నియోజకవర్గానికి రెండు పదవులు దక్కాయి. లక్కవరపుకోట మండల కేంద్రానికి చెందిన మళ్ల రామకృష్ణకు గవర కార్పొరేషన్ సభ్యుడిగా.. జామి మండలం రామయ్యమ్మపేటకు చెందిన మాకిరెడ్డి శ్రీలక్ష్మిని కొప్పలవెలమ కార్పొరేషన్ సభ్యులుగా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీరిద్దరూ తొలి నుంచీ తెలుగుదేశం పార్టీని నమ్ముకొని ఉన్నారు. కార్పొరేషన్లకు సభ్యులుగా ఎంపికైన వీరిని కూటమి నాయకులు అభినందించారు.

కొప్పలవెలమ కార్పొరేషన్‌కు...

వంగర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కింజంగికి చెందిన బల్లిరెడ్డి శ్రీనివాసరావు కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. శ్రీను గత కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పదవికి ఎంపిక చేశారు. ఆయనను టీడీపీ నాయకులు వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ , ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, రవి, త్రినాథ తదితరులు అభినందించారు.



అప్పలనాయుడును అభినందిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే బేబీనాయన

విజయనగరం దాసన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయ నగరానికి చెందిన మిడతాన రవికుమార్ కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన జనసేన పార్టీలో సీనియర్ నాయకులు. జనసేన బలోపేతానికి కృషి చేశారు. ఆయన ఎంపికపై పార్టీ నాయకులు, సైనికులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాడంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. ప్రస్తుతం ఆయన టీడీపీ బీసీ సాధికార సమితి, కొప్పలవెలమ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్‌గా ఉన్నారు. మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు ఆయనను అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

బొబ్బిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీవో జేవీవీ రామ్మోహన రావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో లింగ నిర్ధారిత పరీక్షల నిరోధక చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మూఢ నమ్మకాలతో తల్లిదండ్రులు ఆడపిల్లలను వద్దనుకోవడం సరికాదన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంతోషి కుమారి, డాక్టర్ రోజారాణి, డాక్టర్ శాంతి, రాజ్యలక్ష్మి, సామాజిక కార్యకర్తలు శాంతి, చిన్నతల్లి, చాముండేశ్వరి, ఆశిష్ పాల్గొన్నారు.

సుజయ్‌కు ఎమ్మెల్యే కోళ్ల అభినందన



సుజయ్‌కృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారి

శృంగవరపుకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావును బుధవారం విజయవాడలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

దేవాలయాల అభివృద్ధికి సహకరించండి

శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. బుధవారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌తో కలసి విజయవాడలోని దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణను కలిశారు. దేవాలయ సమస్యలను ఆయనకు వివరించారు. పరిష్కరించాలని కోరారు.

జీడీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టాటా స్ట్రయివ్ సౌజన్యంతో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసున్న విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైనా.. ఫెయిల్ అయిన వారైనా ఈ కోర్సులో చేరవచ్చని చెప్పారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశా లు కల్పిస్తామని చెప్పారు. అలాగే డిగ్రీ పాస్ అయిన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ హస్పటల్స్ లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇంటర్ పాస్ అయినవారికి డిప్లమో పారా మెడికల్ కోర్సుల్లో ప్రస్తుతం అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అన్నారు. పూర్తి వివరాల కోసం 7680945357, 912199 9654 ఫోన్ నెంబర్లలో గాని, రాగోలులో 'జెమ్స్' ఆసుపత్రి క్యాంపస్‌లో తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆటల పోటీలు

రామభద్రపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో బాల బాలికలకు హెచ్ఎం జేసీరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కృష్ణ, వెంకటరమణ, కృష్ణంనాయుడు, సత్యం పాల్గొన్నారు.

అందరూ చదవాలి

గరివిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తికీ కనీసం చదవడం, రాయడం రావాలనే ధ్యేయంతోనే ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని జెడ్పీ సీఈవో బి.సత్యనారాయణ తెలిపారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎం పి.నారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

శృంగవరపుకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం పీడీఎస్ఓ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర కరువు, వలసలు, విద్య, ఉపాధి రంగ సమస్యలు-కర్తవ్యాలు అనే అంశంపై ఈనెల 15న విజయనగరంలో సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ బి.రాజేష్ తెలిపారు.

లక్ష్యాలు సాధించాలి

రేగిడి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, ధాన్యం కొనుగోలు, నీటి తీరువా వసూలు, నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణి సిబ్బందికి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో తహసీల్దారు చిన్నారావు, ఎంపీడీఓ శ్యామలాకుమారి పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి

రాజాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులు, నాయకులపె దారుణంగా మార్ఫింగ్ ఫొటోలతో పోస్టులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెనుబాకలో జెడ్పీటీసీ బండి నర్సింహులు నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

న్యూస్ బాక్స్

జాతీయ సదస్సుకు రాజాం విద్యార్థులు

రాజాం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29 నుంచి డిసెంబరు 4 వరకు ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ సదస్సుకు పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు హాజరు కానున్నారు. రాజాంలోని సెయింటాన్స్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చిత్తిరి జాస్పర్, సామంతుల సాయి నిరంజన్ నాయుడు, మరిపాన దినేష్‌లు గైడ్ టీచర్ డా.సుంకరి రమేష్ సారధ్యంలో సదస్సుకు హాజరుకానున్నారు.

లఘు చిత్రాల పోటీలు

విజయనగరం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఫిలిం సొసైటీ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహనకు చేపట్టిన సంకల్పం, సైబర్ నేరాల నియంత్రణపై లఘు చిత్రాలను ఆహ్వానిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వివరాలకు విజయ్‌మోహన్ విహారి 94407 44741, కమల్‌కుమార్ తుంబలి 84650 33970 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా తులసీ కల్యాణం

జామి, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి): కుమారాం ఐశ్వర్యనగర్‌లో ఉన్న శ్రీఐశ్వర్య లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తులసీ కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జామి విద్యార్థి

జామి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థి జగన్‌మోహన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

గుర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వల్లాపురం జెడ్పీహెచ్ ఎస్ విద్యార్థి పీతల జగదీష్ ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ నెలలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో ఆ విద్యార్థి పాల్గొంటాడని పీడీ ఎం.తిరుపతిరావు తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు...

బాడంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన మామిడి సందీప్ దొర బేస్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబరులో డిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున ఆడనున్నాడని పీడీ జి.బంగారునాయుడు తెలిపారు.

మద్యం షాపును తరలించండి

బొబ్బిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని మేదరబంద జంక్షన్‌లో స్థానికుల పోరాట ఫలితంగా ఇటీవల మద్యం షాపును తొలగించారని.. అదే షాపును అక్కడికి సమీపంలోనే మళ్లీ ఏర్పాటు చేయడం తగదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ షాపును తరలించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం మేదరబంద జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నేత పుణ్యవతి, రైతు సంఘం నాయకుడు ఎస్.గోపాలం, మహిళలు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, పండ్ల దుకాణాలలో తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్యాకేజీలపై కంపెనీల పూర్తి చిరునామా, గరిష్ట ధర, తయారీ తేదీ లేనట్టు గుర్తించారు. ఆటోమొబైల్ షాపులపై ఐదు కేసులు, ఎలక్ట్రానిక్ షాపులపై మూడు, పండ్ల వర్తకులపై మూడు కేసులు నమోదు చేశారు. ఎవరైనా తూకంలో, కొలతల్లో తేడాలు చేసినా.. అధిక ధరలకు విక్రయించినా ప్రజలు 82470 79822 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఆయుష్‌తో ప్రయోజనం

గుర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డయాబెటిస్‌ను ఆయుష్ సేవలతో నయం చేయవచ్చని హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ డి.వెంకటమధు తెలిపారు. బుధవారం తెట్టంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌పీహెచ్, ఆశా కార్యకర్తలతో ఆయన మధుమేహం వ్యాధిని నియంత్రించే విధానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ రజితారోయ్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా శ్రీరాములు

శృంగవరపుకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జరగనున్న అండర్-17 బ్యాడ్మింటన్ స్కూల్ గేమ్స్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున కోచ్‌గా పొట్నూరు శ్రీరాములను ప్రభుత్వం ఎంపిక చేసింది. ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా గతంలో వ్యవహరించారు.

క్రైం కార్నర్

వాహనాన్ని తప్పించబోయి..

కొత్తవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న బస్సును తప్పించబోయి... మరో వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం బొమ్మలరామం మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గుమ్మడి ధర్మారెడ్డి(54)కి సొంతంగా లారీ ఉంది. మంగళవారం విశాఖ నుంచి తన ఖాళీ లారీని కంటకాపల్లి వద్దనున్న శారదా కర్మాగారానికి లోడు కోసం తీసుకు వచ్చాడు. తాడివానిపాలెం సమీపంలోనున్న కాటా వద్ద ముందు వెళుతున్న బస్సును తప్పించబోయి అక్కడ ఆగి ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టాడు. స్టీరింగ్ పొట్టలో నొక్కుకు పోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం విశాఖపట్టణం తరలించగా... బుధవారం శస్త్ర చికిత్స చేసిన తరువాత మృతి చెందాడు. మృతుని కుమారుడు విఘేశ్వర రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో సైబర్ మోసం

కొత్తవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని ఒక న్యాయవాది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నెల రోజులుగా ఆయనను విసిగిస్తున్నారు. ఆ న్యాయవాదికి ఐసీఐసీఐ బ్యాంక్‌లో అకౌంట్ లేకుండానే క్రెడిట్ కార్డు మంజూరు చేశారు. ఆ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తూ నెలకు రూ.12 వేల చొప్పున ప్రీమియం కట్ అవుతుందని చెబుతూ వచ్చారు. తాను ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయకుండా ప్రీమియం ఎలా కట్ అవుతుందని ఆయన వాదించారు. ఎప్పుడో కట్టేసి ఉంటారని.. కట్టకపోతే డీ యాక్టివేట్ చేసుకోండంటూ మొబైల్‌లో ఆప్షన్ చెబుతామన్నారు. వీడియో కాల్ ద్వారా లైన్‌లోకి వచ్చారు. వివిధ రకాల ఆప్షన్లు చెబుతూ... ఓటీపీలు చూస్తూ అతని ఖాతాలోని నగదును మాయం చేయడం మొదలు పెట్టారు. ఇలా మొత్తం రూ.82వేలు దోచేశారు. ఈ విషయమై న్యాయవాది ప్రశ్నించగా మళ్లీ అకౌంట్‌లోకి జమవుతాయని నమ్మబలికారు. చివరకు న్యాయవాది ఫోన్‌ను ఆఫ్ చేసి ఐసీఐసీఐ బ్యాంక్‌కు వెళ్లడంతో విషయం బయట పడింది. ఆ బ్యాంక్‌కు చెందిన ఉద్యోగి సహకారంతోనే ఈ వ్యవహారం జరిగినట్టు గుర్తించారు. దీనిపై కొత్తవలస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ సైబర్ నేరగాడు కాంట్రాక్టులో ఉండడం గమనార్హం.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మక్కువ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన లంకెన సాయికుమార్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. లంకెన సాయికుమార్ (22) మండలంలోని నరాయివలస, మార్కొండ పుట్టి గ్రామాల మధ్య మంగళవారం రాత్రి తీవ్రగాయాలతో ఉండడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ప్రైవేటు వాహనంలో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయికుమార్ మృతిచెందాడు. సాయికుమార్ మక్కువలోని ఏడాదిపాటుగా తాతగారి ఇంటి వద్ద ఉంటూ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనమృతి పట్ల పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్రెయిన్‌డెడ్ కావడంతో వైద్యులు అవయవదానికి కోరినట్లు సమాచారం. సాయికుమార్ ఇంకా వివాహం కాలేదు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు లక్ష్మణరావు, శ్రీదేవి, సోదరి రోదిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కందిశలో వెల్డింగ్ షెడ్ దగ్ధం



దెబ్బతిన్న వెల్డింగ్‌షెడ్, సామగ్రి

రేగిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కందిశ గ్రామంలో బుధవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో కర్రి సంగంనాయుడుకు చెందిన వెల్డింగ్‌షెడ్, దానిలో ఉన్న పేపర్ పేట్లు, యంత్ర సామగ్రి కాలిపోయినట్టు బాధితుడు తెలిపారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని రెవెన్యూ సిబ్బంది అంచ నా వేశారు. స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక శకటం రాకముందే మంటలు అదుపు చేశారు. ఆర్ఐ రేవతి, వీఆర్ఓ నారాయణరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి...వివరాలు సేకరించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



గంజాయి విక్రయదారులతో సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామ శివార్లలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12న విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్‌కు కొంత మంది వ్యక్తులు ద్వారపూడి గ్రామ శివార్లలో గంజాయి అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారంపై రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా... విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలోని వసంత విహార్‌లో ఉంటున్న మునకాల జగన్నాథం, ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తి వద్ద ఐదు కిలోల గంజాయిని కొనుకోలు చేసి... విజయనగరానికి చెందిన బోని అఖిల్, మూర్తి వెంకట ఆదిత్యకు చెరో కిలో అమ్మినట్టు ఒప్పుకున్నారు. వారి నుంచి ఐదు కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.2050 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

దత్తిరాజేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ బూర్జవలసలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు వస్తున్న హెవీ ట్యాంకర్ లారీ ముందు టైరు పేలడంతో అదుపుతప్పి పోలీసు స్టేషన్ ప్రహరీని ఢీకొట్టింది. పోలీసు స్టేషన్ ముందున్న పోర్టికో వరకు దూసుకువెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

25 నుంచి 108 వాహన ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈనెల 25 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు 108 వాహన ఉద్యోగులు ప్రకటించా రు. బుధవారం కలెక్టరేట్ వద్ద 108 ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్పు చేసే ప్రతిసారి ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఎర్నడ్‌లీవులకు సంబంధించిన డబ్బులు ఇవ్వకుండా సంస్థలు వైదొలగుతున్నాయని అన్నారు. దీని వల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి 108 ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 2017లోని అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో 49 ద్వారా ప్రతి ఉద్యోగికి నేరుగా రూ.4000 చెల్లించేదని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేసిందని తెలిపారు. దీన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని... లేని పక్షంలోని సమ్మెకు వెళతామని ఉద్యోగులు తెలిపారు.

బాలికల హాస్టల్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న పెదబాబు, అధికారులు

జామి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): మండల వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బాలికల హాస్టల్ ఎట్టకేలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సహకారంతో సాధ్యమైందని మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హాస్టల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పెదబాబు మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.రెండు కోట్లు విడుదల చేసిందన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

సంతకవిటి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్కరాపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన గ్యాస్ సిలిండర్ పేలి రేకుల ఇల్లు ధ్వంసమైన ఘటనలో బాధితులను రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ కొల్ల అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

గిరిశిఖరంపై వైద్యం

(ఐదో పేజీ తరువాయి)

గిరిజనులను నాటు మందులు, మంత్రాలు, తంత్రాలు వైపు వెళ్లకుండా చేయవచ్చునని కలెక్టర్ ఆలోచన.

త్వరలో ప్రారంభం..

కంటైనర్ ఆసుపత్రి త్వరలో ప్రారంభంకానుంది. వాస్తవానికి ఈ నెల 5న గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో ప్రారంభించడానికి అధికారులు నిర్ణయించారు. అయితే, విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ ఆసుపత్రి గిరిజనులకు అందుబాటులోకి రానుంది.

గిరిజనులకు ప్రయోజనం..

కంటైనర్ ఆసుపత్రితో గిరిజనులకు అధిక ప్రయోజనం కలగనుంది. కరడవలస పరిసర గ్రామాలకు చెందిన 2వేల మంది వరకు వైద్య సేవలు పొందవచ్చు. చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు మైదాన ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. గర్భిణులకు కూడా వివిధ వైద్య పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తాం.

-అక్యాన అజయ్, తోణాం పీహెచ్‌సీ వైద్యుడు

విద్యతోనే అభివృద్ధి

● సీఐడీ డీఎస్పీ ఎంఎన్ భూపాల్



మాట్లాడుతున్న ఎంఎన్ భూపాల్

భామిని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితోనే అభివృద్ధి సాధ్యమని సీఐడీ డీఎస్పీ ఎంఎన్ భూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవోఏ యాక్ట్-1989పై రాష్ట్రంలో ఆరు మారుమూల జిల్లాలో గిరిజనుల్లో అవగాహనకల్పిస్తామన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సమావేశంలో పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, ఏటీడబ్ల్యూవో మంగవేణి, తహసీల్దార్ ఎస్.అప్పారావు, ఎంపీడీవో చంద్రరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్, సీఐడీ ఎస్ఐలు రామ్మూర్తి, రవి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సుగ్రీవులు, బి.రామారావు, రాజేష్ పాల్గొన్నారు.

యాజమాన్యం పక్షపాత ధోరణి విడనాడాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పట్ల యాజమాన్యం పక్షపాత, ధోరణి విడనాడాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె. మధుసూదనరావు, పి.చంద్రశేఖర్ కోరారు. బుధవారం పార్వతీపురం డిపో ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల పట్ల యాజమాన్య వైఖరిలో మార్పులు రావాలని కోరారు. రెండు ఏళ్లగా డ్యూటీ చార్జులు వేయకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్, కె.శంకరరావు, పార్వతీపురం డిపో కార్యదర్శి కేటీ రాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి



మాట్లాడుతున్న రెడ్డి వేణు

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు కోరారు. బుధవారం పట్టణంలోని నవోదయ నగర్ సీపీఎం మండల రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణ అభివృద్ధి కార్య క్రమాలపై చర్చ నిర్వహించి తీర్మానించారు. అనంతరం నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. కన్వీనర్ దావాల రమణారావుతో పాటు ఎ.లక్ష్మణరావు, కె.రాము, డి.దుర్గారావు, ఎస్.భానుచందర్, బి.వాణి, ప్రభాకర్ తదితరులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

పింఛన్లు పునరుద్ధరించకపోతే పోరాటం



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బలిజిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతో పింఛన్లు నిలిపివేయడం సరికాదని, తక్షణమే పునరుద్ధరించకపోతే పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యమ్మల మన్మథరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారాంనాయుడువలసలో ఏడుగురు పింఛన్లు నిలిపివేశారని తెలిపారు.

మెయిన్ వర్కర్లగా మార్చాలి

సాలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లగా మార్చి వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష ,కార్యదర్శులు వై.గౌరీశ్వరీ, శశికళ కోరారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి సీడీపీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



జ్వరాల గురించి ప్రజలను అడిగితెలుసుకుంటున్న అధికారులు

కురుపాం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సహాయ అధికారి సూర్యనారాయణ తెలిపారు. బుధవారంనీలకంఠాపురం పీహెచ్‌సీ పరిధిలోగల సాకి,తియ్యాలి, వబ్బంగి, కాకిలి గ్రామాల్లో ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించారు. నీలకంఠాపురం వైద్యాధికారి అభినవ్‌కుమార్‌ను మలేరియా కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో మలేరియా సూపర్‌వైజరు శ్రీహరి, మోహన్ పాల్గొన్నారు.

రాయగడలో ఆక్రమణల తొలగింపు

రాయగడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయగడ కేంద్రాసుపత్రి సమీపంలో ఉన్న పురాతనమైన రెవెన్యూ నివాసాలను బుధవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. దశాబ్దన్నర కాలంగా నిరుపయోగంగా ఉండడంతో కొందరు ఆక్రమించుకున్నారు.ఈనేపథ్యంలో కొందరు కలెక్టర్ పారుల్ పట్వార్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆక్రమణలు పరిశీలించిన తొలగించాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. రంగంలోకి దిగిన రెవెన్యూఅధికారులు బుధవారం నివాసాలు తొలగిస్తామని ఆక్రమణదారులకు నోటీసులు జారీచేశారు. దీంతో పాత రెవెన్యూ క్వార్టర్లల్లో ఆక్రమణలను తహసీల్దారు ప్రియదర్శిని స్వయి, పురపాలక కార్యనిర్వాహణాధికారి సౌమ్యరంజన్ మిశ్రా పర్యవేక్షణలో తొలగించారు. ఈ స్థలాన్ని జిల్లా కేంద్రాసుపత్రి అవసరాలకోసం కేటాయిస్తారని అధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

బాలలకు స్కేటింగ్ పోటీలు

రాయగడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయగడలోని ప్రేమ్‌పహడ్ వాకింగ్ ట్రాక్ వద్ద మహిళా వాకర్స్‌క్లబ్ సభ్యులు బుధవారం బాలలకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కోరాడ రజిత, వాకర్స్‌క్లబ్ సభ్యులు టి.జయరాం, సత్యవాది పతి , కోరాడ భారతి, బి.లక్ష్మి పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగక.. వ్యాపారాలు సాగక

● పార్వతీపురం కూరగాయల మార్కెట్లో వినియోగదారుల అవస్థలు



అంధకారంగా మారిన ప్రధాన కూరగాయల మార్కెట్

పార్వతీపురంటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో వీధి దీపాలు కొద్ది నెలలుగా వెలగకపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. చుట్టుపక్కల నుంచి వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులతో నిత్యం క్రయవిక్రయదారులతో రద్దీగా ఉంటోంది.విద్యుత్‌దీపాలు వెలగకపోవడంతో చీకటిపడిన తర్వాత వ్యాపార కార్యకలాపాలు సాగడంలేదు. ఇప్పటికే పలుసార్లు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులకు మార్కెట్లో దీపాలు ఏర్పాట్లు చేయాలని వ్యాపారులు, వినియోగదారులు కోరారు. కొద్దిరోజులుగా షాపులకు సరఫరా అవుతున్న విద్యుత్‌లో లోవోల్టేజీ సమస్య తలెత్తుతుండంతో చీకటిపడితే ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని, వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

సీఎంను కలిసిన జగదీశ్వరి



ముఖ్యమంత్రిని కలిసిన మంత్రి సంధ్యారాణి, విప్ తోయక జగదీశ్వరి, విజయచంద్ర

గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని శాసనసభ విప్‌గా ప్రభుత్వం నియమించడంతో సీఎం చంద్రబాబునాయుడు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు.ఆమెతోపాటు గిరిజనసంక్షేమశాఖ మంత్రి తోయక సంధ్యారాణితోపాటు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉన్నారు. విప్‌గా నియమితులు కావ డంతో టీడీపీ మండలాధ్యక్షుడు పాడి సుదర్శనరావు, కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, నాయకులు బిడ్డిక పద్మ, కద్రక కళావతి హర్షం వ్యక్తంచేశారు. కాగాకూటమి ప్రభుత్వం మారుమూల కురుపాం నియోజకవర్గానికి గుర్తింపు ఇచ్చినందుకు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు హర్షం వ్యక్తం చేశారు. వనజలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

కురుపాం నియోజకవర్గానికి ప్రాధాన్యం

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గానికి పాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని నియమించడంపై హర్షం వ్యక్తంచేశారు. బుధవారం ఖడ్గవలస సముదాయంలో టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, రాష్ట్ర ప్రతినిధి మర్రాపు పురుషోత్తం నాయుడు, జిల్లా పార్టీ ప్రతినిధులు అంబటి తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరడాన తవిటినాయుడు, అరకు బీసీ సెల్ అధికార పార్టీ ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ డి.గౌరమ్మతో పాటు మండల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి / ● ఉల్లాస్ శిక్షణ తరగతుల ప్రారంభం



జియ్యమ్మవలస: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు వలంటీర్లు స్వచ్ఛందంగా, బాధ్యతతో కృషి చేయాలని ఎంపీడీవోలు కోరారు. బుధవారం జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) శిక్షణ తరగతులు నిర్వహించారు.

● జియ్యమ్మవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత వల్ల దేశ అభివృద్ధికి తీవ్ర విఘాతం కలగడంతో పాటు వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని రూపుమాపాలంటే ప్రతి ఒక్కరు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక జియ్యమ్మవలసలో ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకులు కె.రామారావు, ఏపీఎం నాగభూషణరావు, పల్లి రాజేశ్వరి ద్ల పాల్గొన్నారు.

●కొమరాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపీడీవో మల్లిఖార్జునరావు కోరారు.కొమరాడలో ఉల్లాస్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో జె.నారాయణస్వామి, వెలుగు ఏపీఎం పి.సురేష్ పాల్గొన్నారు.

●వీరఘట్టం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు అంకితభావంతో పనిచేసి గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో బి.వెంకటరమణ కోరారు. వీరఘట్టంలోనిఉల్లాస్ వలంటీర్ల రెండోరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్య క్రమం లో ఏపీఎం కె.రాము సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వయోజనుల కోసమే ప్రభుత్వం ఉల్లాస్ కార్య క్రమం ప్రారంభించదని ఐకేపీ ఏపీఎం పి.కమలకుమారి తెలిపారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లు కృషి చేయాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి కోరారు. గరుగుబిల్లిలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. సమావేశంలో మండల వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, వి.లక్ష్మణరావు, టి.చంద్రమోహన్, కె.దాసు, కె.రమేష పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పీవో

సీతంపేట రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్, లాంగ్ జంప్ విభాగంలో పెద్దమడి బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న ఎం.కృపాసింధు, షాట్‌పుట్‌లో ఎస్.నైమిష, ట్రిపుల్ జంప్‌లో ఎస్. సమితలు ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయ స్థాయి క్రీడాపోటీలను ఎంపికైన వివిధ పాఠశాలల విద్యార్థులను ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

క్రీడాకారునికి అభినందన

వీరఘట్టం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగంపేట ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న కొండగొర్రె చైతన్య ఈనెల 11న భోగాపురంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అండర్-14 విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు తరపున పాల్గొన్నాడు. ఈమేరకు జట్టు విజేతగా నిలిచింది. దీంతో జట్టులో సభ్యుడిగా ఉన్న చైతన్యకు ఐటీడీఏ ఐటిడిఏ సీతంపేట ఉప సంచాలకులు అన్నదొర్, సహాయ ప్రాజెక్టుఅధికారి చిన్నబాబు, హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

సీతంపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ మహిళా పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం. రాంబాబు ఆదేశించారు. బుధవారం సీతంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేపట్టిన ఆయన కేసు ఫైల్స్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్ఐ అమ్మన్నరావును ఆదేశించారు.

కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

పార్వతీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులను కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది. అరకు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, గరుగుబిల్లి మండల టీడీపీ అధ్యక్షుడు అక్కెన మధుసూదనరావును నియమితులయ్యారు.ఈ మేరకు బుధ వారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజన బాలుడు మృతి

సాలూరు రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఏవోబీలోని సంపంగిపాడు పంచాయతీ పరిధిలోగల నేరేడివలసలో గిరిజన బాలుడు వేముల రామకృష్ణ (7) మృతిచెందినట్టు బుధవారం తల్లిదండ్రులు కన్నయ్య, శ్రావ్య తెలిపారు. మంగళవారం జ్వరం రాగా, వాంతి కావడంతో పాటు ఫిట్స్ రావడంతో ఆకస్మికంగా మృతి చెందినట్లు చెప్పారు. కాగా రామకృష్ణ ఫిట్స్‌తో మృతి చెందాడని తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత తెలిపారు. ఆయనకు గతంలోను ఫిట్స్ వచ్చిందని, విషయం తెలియగానే గ్రామానికి వైద్యసిబ్బంది పంపించామని చెప్పారు. గ్రామంలో ఆరుగురు వైరల్ జ్వరాలతో బాధపడుతుండగా చికిత్స చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దు

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలను చదవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి కోరారు. బుధవారం స్థానిక కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.ఉమాసౌమిత్‌రాజు, అధ్యాపకులు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, రాఘవేం ద్రనాయుడు, పి.రాజ్యలక్ష్మి, ఎస్.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉన్నతి సర్వే చేయించుకోండి: ఏపీవో

జియ్యమ్మవలస, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఉన్నతి సర్వేను ప్రతి కుటుంబం చేయించుకోవాలని ఏపీవో కలిశెట్టి శ్రీనివాసరావు కోరారు. బుధవారం జియ్యమ్మవలసలో విలేకరులతో మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లో పదో తరగతి, ఆపై చదివిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని గుర్తించడమే లక్ష్యంగా సర్వే జరుగుతుందన్నారు. వీరిని గుర్తించిన తర్వాత వారు ఏయే రంగాల్లో ఆసక్తి చూపుతున్నారో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగాఉందన్నారు.జాబ్‌కార్డు గల కుటుంబాలపై 16వ తేదీ వరకూ సర్వే చేస్తామని, చనిపోయిన వారు, పెళ్లయి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారిని గుర్తించి తొలగిస్తామని తెలిపారు. మండలంలో 16,063 జాబ్‌కార్డులు ఉండగా 13,863 జాబ్‌కార్డులు పనులు వచ్చిన కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. మార్పులు, చేర్పులు చేసిన జాబితాను 16, 17, 18 తేదీల్లో పంచాయతీ కేంద్రంలో ప్రదర్శిస్తామని, 20న గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

పార్వతీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన గర్భిణుల వసతి గృహాల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం, సాలూరు గిరిజన గర్భిణుల వసతిగృహాల సిబ్బంది జ్యోతి, త్రివేణి, రాములమ్మ, నాగమణి, సంతోషి, రమణమ్మ తదితరులతో కలిసి పార్వతీపురంలో ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ఉద్యోగాలకు ప్రభుత్వం పోస్టులు మంజూరు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.సీఎఫ్ఎంఎస్‌లో బకాయి ఉన్న 12 నెలల జీతాలు, గతంలో బకాయిపడిన 21 నెలలకు సంబంధించిన సగం జీతాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు పాలవలస భగవాన్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్‌పై దృష్టి సారించాలని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. బుధవారం మండలంలోని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌నాయుడుతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

●పార్వతీపురంటౌన్, నవంబరు 13: విద్యార్థి దశ నుంచి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పట్టణ పోలీసు స్టేషన్ సీఐ నారాయణరావు కోరారు. బుధవారం పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో మాదక ద్రవ్యాలు, మహిళలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● సీతానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు విధిగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ ఎం.రాజేష్ కోరారు. బుధవారం మండలంలోని పణుకుపేట జంక్షన్‌లో వాహనచోదకులు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ప్రిన్సిపాల్‌కు గురు బ్రహ్మ అవార్డు

మక్కువ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.మంజులవీణకు అధ్యాపకులు అభినందించారు. ఈ మేరకు విద్యా రంగం, సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి విశాఖపట్నానికి చెందిన మదర్‌థెరిస్సా సేవా సంస్థ గురు బ్రహ్మ రాష్ట్రస్థాయి అవార్డు అందజేసింది.

బాల్య వివాహాలు చేయవద్దు

సాలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయవద్దని గిరిజనులకు స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ పిలుపునిచ్చారు. బుధవారం దిప్పలపాడులో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తవిటమ్మ,సీత పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో లాభం

వీరఘట్టం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులకు లాభదాయకమని ఉద్యానశాఖ మండల అధికారి అమరేశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని కంబరవలసలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో శ్రీనివాస పామాయిల్ కంపెనీ మేనేజర్ వీరబాబు, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల సంఘ ప్రతినిధి దుర్గాప్రసాద్ కోరారు. బుధవారం మండలంలోని కొంకడివరంలో అంబేడ్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైనసేవలందిస్తున్నామని తెలిపారు. 104 వాహనాలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేషర్ శంకరరావు పాల్గొన్నారు.

నేడు ఉల్లాస్‌పై అవగాహన

మక్కువ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మక్కువలో 148 మంది వయోజనవిద్యా వలంటీర్లకు ఉల్లాస్‌పై కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించనున్నట్టు ఎంపీడీవో స్వరూపారాణి బుధవారం తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నియమించిన ఈవో, ఏఈవో, పీవో ఏపీవోలకు ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయవారోత్సవాలు నిర్వహించనున్నారు.ఈ మేరకు బుధవారం సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

సీతంపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జన జాతీయ గౌరవ దివస్ పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఈనెల 26 వరకు గిరిజన పాఠశాలల్లో వ్యాచరచన, చిత్రలేఖనం, వ్యక్తిత్వంతో పాటు క్రీడాపోటీలు నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అధికారులతో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సం క్షేమ ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం క్లస్టర్ స్థాయిలో పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు 20న ఐటీడీఏ స్థాయిలో పోటీలు నిర్వహించాలని తెలిపారు.

18న కలెక్టరేట్ వద్ద ధర్నా

సాలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద ఈనెల 18న నిర్వహించనున్న ధర్న ఆశా వర్కర్లు విజయవంతం చేయాల ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త రికార్డులుఇవ్వాల్సి ఉన్నా నేటికీ ఇవ్వలేదన్నారు. మెడికల్ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆశా వర్కర్లు గెమ్మెల నీలమ్మ,గంగనిర్మల,మాధవి,రాధ పాల్గొన్నారు.

మే 12 నుంచి శ్రీనూకాలమ్మ పండగ

పాచిపెంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట శ్రీనూకాలమ్మ అమ్మవారి పండగ తేదీలను గ్రామ పెద్దలు ఖరారు చేశారు. వచ్చే ఏడాది మే 12, 13, 14 తేదీల్లో పండగ నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిశ్చయించారు, 2010లో ఈ పండగ నిర్వహించారు.

నెల్లికిక్కవ్‌లో కంటి వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):నెల్లికిక్కవ్ గ్రామంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఎస్ సొసైటీ సహకారంతో నేత్ర వైద్య శిబిరం బుధవారంనిర్వహించారు. ఈసందర్భంగా 60 మందికి కంటి తనిఖీలు నిర్వహిం చగా 26 మందికి శస్త్రచికిత్స కోసం విజయనగరం తరలించారు.

● కొమరాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలోగల గ్రామాల్లో నిర్వహించిన నేత్ర వైద్య పరీక్షల్లో భాగంగా ఎంపికైన వారికి శస్త్రచికిత్స నిమిత్తం రోగులను విజయనగరం తరలించినట్లు జిల్లా అంధత్వ నివారణ అధికారి తెలిపారు.కేటరాక్ట్, టేరిజియంఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం బుధవారం కొమరాడ పీహెచ్‌సీ నుంచి పుష్ప గిరి కంటి ఆసుపత్రికి తరలించారు. గురువా రం శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు.